ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 31.0 । కనిష్ఠం : 23.0
ANDHRAJYOTHY 5
వనపర్తి
జిల్లా వార్తలు
మంగళవారం 6 ఆగస్టు 2024



ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

జడ్చర్ల, ఆగస్టు 5 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం పోలేపల్లి గ్రామంలో నక్క సత్యనారాయణ(40) సోమవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. జడ్చర్ల పట్టణంలోని ఓ ఫైనాన్స్ వ్యాపారి వేధింపులను తట్టుకోలేక ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. ఫైనాన్స్ వ్యాపారి తన భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకుని నగదు ఇచ్చాడని, అతని వేధింపుల కారణంగానే ఆత్మహత్య చేసుకున్నట్లుగా సత్యనారాయణ సూసైడ్ నోట్ రాశాడని గ్రామస్థులు వివరించారు. కాగా ఈ సంఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలి

- ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఆగస్టు 5 : ప్రతీ ఒక్కరు విధిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. ఆగస్టు 5 నుంచి 9వ తేదీ వరకు ఐదురోజుల పాటు సాగే ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులతో పాటు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని చిన్నారెడ్డి కోరారు. స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమం ప్రారంభోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల మైదానం నుంచి పాలిటెక్నిక్ కళాశాల మైదానం వరకు విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కలెక్టర్ హాజరై జెండా ఊపి, ర్యాలీని ప్రారంభించారు. అనంతరం వారు పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో మొక్కలు నాటి శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ మన పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా రోగాల బారిన పడకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. ప్రతీ ఒక్కరు ఒక మొక్క నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. పశ్చిమ కనుమల్లో అటవీశాతం ఎక్కువగా ఉండడం వల్ల మహారాష్ట్ర, కర్ణాటకలో కురుస్తున్న వర్షాలకు కృష్ణానది ప్రవాహం వస్తుందన్నారు. నల్లమల అటవీ ప్రాంతంలో చాలావరకు చెట్లు నరికివేయడం వల్ల ఇక్కడ వర్షాలు లేవన్నారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్లల్లో, పరిసరాల్లో శుభ్రం చేసుకుని స్థలం ఉన్న ప్రతీచోట మొక్కలు నాటాలని తద్వారా జిల్లాలో అటవీశాతాన్ని పెంచాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్) సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్(రెవెన్యూ) ఎం.నగేష్, మునిసిపల్ చైర్మన్ మహేష్, జిల్లా అధికారులు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, మహిళా సమాఖ్య సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న చిన్నారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి తదితరులు

జల కలేనా?

- నిండిన ఆర్డీఎస్, సుంకేసుల జలాశయాలు
- ప్రారంభం కాని తుమ్మిళ్ల ఎత్తిపోతలు
- నీళ్లొచ్చినప్పుడే పనులు చేయడంపై ఆగ్రహం
- కర్ణాటకలో ఆర్డీఎస్ కాలువకు గండి..?
- నీటి కెపాసిటీ తగ్గించిన అధికారులు
- సాగునీటి కోసం రైతన్న ఎదురు చూపులు



తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం



నీరు ఎత్తిపోయకపోవడంతో ఒట్టిపోయిన కాలువ

గద్వాల, ఆగస్టు 5: కృష్ణాబేసిన్‌లో సమృద్ధిగా వర్షాలు కురవడంతో కృష్ణ, తుంగభద్రలకు వరదలు వచ్చాయి. దీంతో కృష్ణా, తుంగభద్రపై ఉన్న ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. తుంగభద్ర ప్రాజెక్టు పూర్తిగా నిండి ఆర్డీఎస్, సుంకేసుల జలాశయం దాటి శ్రీశైలం వైపు గంగమ్మ పరుగులు పెట్టింది. అయినప్పటికీ ఆర్డీఎస్ కింద ఉన్న రైతులకు సాగు నీటికోసం ఎదురుచూపులు తప్పడం లేదు. సుంకేసులకు జలకళ వచ్చినా దానిపై నిర్మించిన తుమ్మిళ్ల ప్రాజెక్టు ఎత్తిపోతలు ప్రారంభించకపోవడంతో జల కలేనా అని రైతులు ఆవేదన చెందుతున్నారు. భారత్‌మాల ఆరు లేన్ల రోడ్డు నిర్మాణం ఆర్డీఎస్ కాలువపై జరుగుతుండటంతో తుమ్మిళ్ల ఎత్తిపోతలను ప్రారంభించలేదని తెలుస్తోంది. ప్రస్తుతం వేసిన పంటలు ఎండిపోతున్నాయని త్వరగా నీళ్లు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఆర్డీఎస్ కాలువ పారుదల అంతంతే..

ఆర్డీఎస్ ప్రాజెక్టు నుంచి కాలువకు నీటిని విడుదల చేశారు. ఆ నీళ్లు గత నెల 27వ తేదీన తెలంగాణ సరిహద్దుకు చేరుకోగా ఏఐసీసీ సెక్రటరీ సంపత్‌కుమార్ గేట్లు తెరిచి నీటిని విడుదల చేశారు. కానీ నీటి పారుదల నెమ్మదిగా ఉండటంతో నీటి పెంపునకు ఇరిగేషన్ అధికారులు కోరారు. కర్ణాటక అధికారులు 850 క్యూసెక్కులకు పెంచారు. డీ-22 వరకు చేరుకోగానే కర్ణాటకలోని 10వ కిలోమీటర్ వద్ద చిన్నపాటి బుంగపడింది. దీంతో మళ్లీ అధికారులు నీటి విడుదల కెపాసిటీని తగ్గించారు. వాస్తవానికి ఆర్డీఎస్ కింద తెలంగాణలో 15.9 టీఎంసీలను ఉపయోగించి 84వేల ఎకరాలకు నీటిని అందించాల్సిన కాలువ నిర్వాహణ లోపం కారణంగా నీటిపారుదలకు అడ్డంకులు ఏర్పడుతున్నాయి. దీంతో ప్రతీ ఏడాది 22వేల ఎకరాలకు కూడా నీటిని అందించలేని పరిస్థితి ఉంది. ప్రస్తుతం పత్తి పంట సాగు చేయగా.. వరి నారుమళ్లను పోసుకున్నారు. పూర్తిస్థాయిలో నీరు వస్తే వరినాట్లు వేయడానికి సిద్ధంగా ఉన్నారు.

ఎత్తిపోయడం లేదు..

ఆర్డీఎస్ ప్రాజెక్టు నుంచి 15.9టీఎంసీలను ఉపయోగించి ఆంధ్రాలోని మూడు గ్రామాలను కలుపుకొని తెలంగాణలో 87,500 ఎకరాలకు సాగునీరు అందించాలి. కానీ ఎప్పుడూ 20వేల నుంచి 30వేల ఎకరాలకు మించి సాగునీరు అందించకపోవడంతో గత ప్రభుత్వం తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాన్ని 2018 జూన్‌లో ప్రారంభించింది. ఆర్డీఎస్ కాలువ పరిధిలోని డీ-23 నుంచి డీ-40 వరకు 55,600 ఎకరాలకు సాగునీరు అందించాలి. గతేడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా తుంగభద్రకు ఆలస్యంగా నీళ్లు రావడంతో ఆగస్టు 9వ తేదీనా మోటార్లను ప్రారంభించారు. కానీ ఈ ఏడాది జూలై 25వ తేది నాటికే సుంకేసుల జలాశయానికి నీళ్లు వచ్చాయి. అయినప్పటికీ ఇప్పటి వరకు తుమ్మిళ్ల మోటార్లను ఇరిగేషన్ అధికారులు ఆన్ చేయకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 55,600ఎకరాల ఆయకట్టుదారులతో పాటు దానిపై ఆధారపడిన నాన్ ఆయకట్టు దారులు 20వేల ఎకరాల రైతులు కూడ ఆశగా ఎదురు చూస్తున్నారు. కాగా ఆర్డీఎస్ కాలువపై కొంకల శివారులో భారత్ మాల ఆరులేన్ల రోడ్డు నిర్మాణం జరుగుతుండటంతో తుమ్మిళ్ల ఎత్తిపోతలను ప్రారంభించలేదని తెలుస్తోంది. ఇరిగేషన్ అధికారులు పలుమార్లు నోటీస్ చేయడంతో రెండు రోజుల్లో క్లియర్ చేస్తామని చెప్పినట్లు తెలుస్తోంది.

ఎండు మొఖం పడుతున్న పంటలు

ఆర్డీఎస్, తుమ్మిళ్ల ఎత్తిపోతల ప్రాజెక్టు పరిధిలో వేల ఎకరాలలో పంటలను సాగు చేసిన రైతులు నీటికోసం ఎదురు చూస్తున్నారు. దీనికింద సాగుచేసిన మొక్కజొన్న, పత్తి, కందులు, మిరప పంటలు ఎండు మొఖం పట్టాయి. వర్షాలు లేకపోవడంతో నీటి తడులకోసం రైతులు తుమ్మిళ్ల ప్రాజెక్టు వైపు చూస్తున్నారు. త్వరగా పంపులు ప్రారంభిస్తే పంటలకు జీవం పోసినట్లవుతుందని ఇరిగేషన్ అధికారులను వేడుకుంటున్నారు. అదేవిధంగా వరినారుమళ్లు పోసుకుంటామని కోరుతున్నారు.



నీటి తడులకు నోచుకోని పత్తి పైరు

పంటలు ఎండుతున్నాయి



నేను నాలుగు ఎకరాలలో పత్తిపంట వేశాను. ఒక ఎకరంలో మొక్క జొన్న వేశాను. పత్తి పూత వచ్చి కాయలు పట్టేదశలో ఉంది. ఎండుమొఖం పట్టింది. ఇప్పుడు నీటి తడులు ఇవ్వకపోతే పూత రాలిపోయి నష్టం వచ్చే అవకాశం ఉంది. అధికారులు త్వరగా కాలువలకు నీళ్లు ఇవ్వాలి.

- నర్సింహులు, రైతు
కొంకల గ్రామం

వీలైతే నేడు పంపులు ఆన్ చేస్తాం



భారత్ మాల పనులు ఆర్డీఎస్ కాలువపై జరుగుతుండటంతో ఎత్తిపోతలను ప్రారంభించలేదు. నిర్మాణదారులు ఆదివారం నాటికి కాలువపై లైన్ క్లియర్ చేస్తామన్నారు. వీలైతే మంగళవారం పంపలను ప్రారంభించి రైతులకు సాగునీళ్లు అందిస్తాం. ఇప్పటికే పూడిక, జంగిల్ క్లియరెన్స్, డీ-29 పరిధిలో సబ్‌డిస్ట్రిబ్యూటర్లకు షెటర్ల బిగింపును పూర్తి చేశాం. సాగుకు ఢోకాలేకుండా నీళ్లు అందిస్తాం.

- విజయ్‌కుమార్‌రెడ్డి
ఈఈ, ఆర్డీఎస్
గద్వాల

వ్యర్థాల వేలం రూ.29.30 లక్షలు

- 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలతో బల్దియాకు ఆదాయం
- చికెన్ వ్యర్థాలకు తొలిసారి బహిరంగ వేలం నిర్వహణ



చికెన్, చేపల వ్యర్థాల వేలం నిర్వహిస్తున్న చైర్మన్, కమిషనర్‌లు

వనపర్తి టౌన్, ఆగస్టు 5: ప్రతీ సంవత్సరం పక్కదారి పడుతూ ప్రజా ప్రతినిధులు, అధికారుల జేబులు నింపుతున్న చికెన్, చేపల వ్యర్థాల ఆదాయం ఎట్టకేలకు మునిసిపల్ ఖజానాలోకి చేరబోతుంది. వ్యర్థాల తరలింపుపై ఇప్పటి వరకు ఎలాంటి టెండర్ నిర్వహించని అధికారులు ఆంధ్రజ్యోతి వరుస కథనాలతో స్పందించారు. వ్యర్థాల తరలింపు కోసం బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని ప్రకటించి దరఖాస్తులు స్వీకరించారు. దీంతో వేలం పాటలో పాల్గొనేందుకు తొమ్మిది మంది ఆసక్తి కనబర్చి ప్రభుత్వ నిబంధనల ప్రకారం డీడీలు చెల్లించారు. ఎట్టకేలకు సోమవారం మునిసిపల్ కార్యాలయంలో చైర్మన్ పుట్టపాకల మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, కమిషనర్ పూర్ణచందర్ ఆధ్వర్యంలో బహిరంగ వేలం పాట నిర్వహించారు. వేలం పాటలో సిల్‌మార్తి అంజనేయులు, కృష్ణసాగర్ అనే వ్యక్తుల మధ్య పోటీసాగిన వేలం పాటలో సిల్‌మార్తి ఆంజనేయులు రూ. 29.30 లక్షలకు టెండర్ దక్కించుకున్నాడు. దీంతో మునిసిపల్ ఆదాయానికి ఆదాయం సమకూరిందని స్థానిక నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. వరుస కథనాలు ప్రచురించి అధికారులు, నాయకుల్లో చలనం తీసుకువచ్చిన ఆంధ్రజ్యోతి పత్రికకు అధికారులు, కౌన్సిల్ సభ్యులు ధన్యావాదాలు తెలిపారు.



డబ్బులు కట్టిస్తానని ఉడాయింపు

- జిల్లా కేంద్రంలో మరో ఘటన
- 'ఆంధ్రజ్యోతి' కథనంతో కదిలిన బాధితులు
- సొమ్ము చెల్లించకుండానే పరారీ



మోసం చేసిన వారిని అరెస్టు చేయాలని ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఖాజా

నాగర్‌కర్నూల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లాలోని తెలకపల్లి మండలం నడిగడ్డకు చెందిన ఓ యువకుడు దాదాపు రూ.7 కోట్లు కుచ్చుటోపి పెట్టిన విషయం 'ఆంధ్రజ్యోతి' జూలై 11న వెలుగులోకి తెచ్చింది. సంఘటనకు సంబంధించి బాధితులు నాగర్‌కర్నూల్ పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. నడిగడ్డకు చెందిన వరుసకు అన్నదమ్ములు సొంత కుటుంబాన్ని రంగంలోకి దించి అధిక వడ్డీ పేరిట దాదాపు ఏడు కోట్ల వరకు ముంచారు. రెండేళ్లపాటు ఇద్దరూ కలిసి అధిక వడ్డీ పేరిట మోసం చేసిన సదరు యువకులు విబేధాలతో విడిపోయి ఒకరికి తెలియకుండా మరొకరి నుంచి లక్షల రూపాయలను సేకరించారు. బాధితులందరూ వీరిని ప్రశ్నించే క్రమంలో ఒకరు హాజరైతే మరొకరు పరారవుతున్నారు. ఈ విషయంలో కూలీనాలి అప్పు సొప్పు చేసిన సామాన్య జనం బలవుతున్నారు. ఆంధ్రజ్యోతిని ఆశ్రయించిన బాధితులు నాగర్‌కర్నూల్ ఎస్పీకి లిఖితపూర్వకమైన ఫిర్యాదు చేశారు. పిలిచి విచారిస్తామని, బాధితులందరికీ న్యాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అయితే జనాన్ని మోసగించిన ఇద్దరు బాధితులు పోలీసులను కలవకుండా ఎత్తుగడలు వేస్తున్నారు. డిపాజిట్ సేకరించిన ఇద్దరు ఒకేసారి పోలీసుల వద్దకు రావడం లేదు. దీని కారణంగా బాధితులకు ఏం చేయాలో తోచని పరిస్థితి ఏర్పడింది. వీరి పరిస్థితిని బ్రోకర్లు సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులను కలిపిస్తామని మీ డబ్బులు మీకిచ్చే క్రమంలో మా కమీషన్ మాకివ్వాలంటూ ఒత్తిడి తేస్తున్నారు. ఆంధ్రజ్యోతిలో ఈ కథనం బయటకు వచ్చిన తర్వాత నిందితులు పోలీసులను కలిసి వెళ్లాక కూడా ఈ తతంగమంతా కొనసాగుతోంది. బాధితులకు న్యాయం జరగాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఖాజా బాధితులతో కలిసి ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ అంశంపై అన్ని కోణాల్లో దర్యాప్తు జరిపి బాధితులకు న్యాయం చేకూరుస్తానని ఎస్పీ హామీ ఇచ్చారు. ఈ అంశంలో లోతుగా దర్యాప్తు జరిపితే కూలీనాలీ చేసుకోవడం తోపాటు పేద జనానికి న్యాయం జరిగే అవకాశం ఉంది.

ఆశావహుల సందడి

- కొన్నిచోట్ల తాజామాజీ సర్పంచ్‌లు
- మరికొన్నిచోట్ల అధికారపార్టీ శ్రేణులు
- ప్రజలకు చేరువయ్యేందుకు ప్రయత్నాలు
- ప్రభుత్వ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న నాయకులు
- రిజర్వేషన్లపై అంతర్మథనం

మహబూబ్‌నగర్, ఆగస్టు 5: అన్నీ అనుకున్నట్లుగా జరిగితే ఈ పాటికే సర్పంచ్ ఎన్నికలు ముగిసి సర్పంచ్‌లు పాతబడేవారు. ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకపోవడంతో ఆశావహులు ఎప్పుడెప్పుడు ఎన్నికలు నిర్వహిస్తారా అని ఎదురు చూడాల్సి వస్తోంది. ఇంకా ఎన్నికలకు నెలలు పట్టే అవకాశం ఉండటంతో అప్పటిదాకా ప్రజల్లో ఉంటూ వారి మద్దతుకోసం ఆశావహులు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఉమ్మడి పాలమూరులో 1,690 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో పాలమూరు జిల్లాలోనే 441 ఉన్నాయి. వీటికి ఈ ఏడాది జనవరి 31తో గడువు ముగియడంతో ఆరు నెలలు ప్రత్యేక పాలన విధించారు. ఈ సమయం కూడా జూలైతో ముగియగా, మళ్లీ పెంపు అనివార్యమైంది. ఆరు నెలలు గడిచినా ఎన్నికలు నిర్వహించకపోవడంతో ఎన్నికల కోసం ఎదురుచూసిన గ్రామ నాయకులు ఇక ప్రభుత్వ కార్యక్రమాలలో హల్‌చల్ చేస్తూ ప్రజల దృష్టిని ఆకర్శించే ప్రయత్నాలు మొదలెట్టారు. ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా తాము పోటీలో ఉంటామని సంకేతాలు ఇస్తున్నారు. కొన్ని చోట్ల ప్రజల్లో పేరున్న తాజా మాజీలు మళ్లీ ప్రజలమధ్యే ఉంటుండగా, మరికొన్ని చోట్ల అధికారపార్టీకి చెందిన నాయకులు ప్రభుత్వం తమదేనని, తాముంటేనే పనులవుతాయని ప్రజలకు దగ్గరయ్యే ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక్కో గ్రామంలో నలుగురు, ఐదుగురు ఆశావహులు తమవంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రెండు పర్యాయాలు జరిగిన ఎన్నికల్లో ఆ పార్టీకి చెందిన సర్పంచ్‌లే 90శాతం నెగ్గారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటంతో ఈ సారి తమను ఆదరిస్తారని కాంగ్రెస్‌శ్రేణులు ప్రజలకు దగ్గరయ్యే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. దీంతో గ్రామాల్లో ఆశావహుల సందడి నెలకొంది.

ప్రభుత్వ కార్యక్రమాలు, పండగల సందర్భంగా అధికారపార్టీ శ్రేణుల సందడి కనిపిస్తోంది. ఇటీవల జరిగిన రెండు విడతల రుణమాఫీ కార్యక్రమంలో ఆయా గ్రామాల్లో రుణమాఫీ అయిన రైతులను కలిసి వారితో సంబురాలు చేయించడం.. బోనాల ఉత్సవాలలో కావాల్సిన సౌకర్యాలు చూసుకోవడం.. తాజాగా ప్రభుత్వం అమలుచేస్తున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలోనూ ఆశావహుల సందడే కనిపిస్తోంది. పంచాయతీలకు రెండుపర్యాయాలు ఒకే రిజర్వేషన్ అంటే గత ఎన్నికల ముందు అప్పటి ప్రభుత్వం చట్టం చేసింది. ప్రస్తుతం అవే రిజర్వేషన్లు ఉంటాయని ఆయా సామాజిక వర్గాలకు చెందిన ఆశావహులు తమ ప్రయత్నాలు మొదలు పెట్టారు. ప్రభుత్వం మారడంతో ఒకవేళ చట్టంలో మార్పులు చేసి కొత్త రిజర్వేషన్‌లు అమలుచేస్తే ప్రస్తుత ఆశావహుల ఆశలపై నీళ్లు చల్లినట్లవుతుంది. అప్పుడు కొత్త నాయకులు తెరపైకి వచ్చే అవకాశం ఉంటుంది. ప్రస్తుత ఆశావహులను లోలోన రిజర్వేషన్‌ల భయం కూడా వెంటాడుతోంది.

ప్రత్యేక పాలనతో పల్లెలు

పంచాయతీలలో ప్రత్యేక పాలన కొనసాగుతోంది. ఇప్పటికే ఆరు నెలలు గడిచిపోగా, మరో మూడునెలలు వారి పాలనే కొనసాగే అవకాశాలున్నాయి. ప్రత్యేక అధికారులుగా మండలస్థాయి అధికారులే ఉండటంతో వారి కార్యాలయాల్లోని పనుల్లోనే చాలామంది బిజీగా ఉండగా పంచాయతీపాలన అదనపు భారం అవుతుందని పలువురు అధికారులు వాపోతున్నారు. కొందరికి రెండేసి గ్రామాలున్నాయి. దీంతో ఆయా గ్రామాలపై పూర్తిస్థాయి పర్యవేక్షణ చేయలేకపోతున్నారు. పంచాయతీ కార్యదర్శులపైనే భారం పడుతోంది. ఏ పని ఉన్నా పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక అధికారుల వద్దకు వెళ్లాల్సి వస్తోంది. నిధులు కూడా లేకపోవడంతో చిన్నచిన్న పనులు కూడా చేయించలేకపోతున్నామని కార్యదర్శులు వాపోతున్నారు. కొందరు ఆశావహులు చిన్నచిన్న పనులకు సొంతంగానే ఖర్చు చేస్తున్నారు. లైట్లు వేయడం, రోడ్లపై మొరం వేయించి మరమ్మతులు చేయించడం వంటి పనులు చేయిస్తున్నారు.

భూమికి పచ్చాని రంగేసినట్టు..





ఇటీవల కురిసిన ముసురు వర్షాలకు ప్రకృతి పచ్చబడి ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటోంది. అటవీ ప్రాంతం, పంటపొలాల్లో చెట్లు చిగురించాయి.. రైతన్నలు సాగుచేసిన మెట్ట, తరి పంటలతో భూమాత పచ్చని అందాలను పులుముకొని మురిసిపోతున్నట్లుగా ఉన్న ఈ దృశ్యాలు కోయిలకొండ సమీపంలో ఆంధ్రజ్యోతి క్లిక్‌మనిపించింది..

- ఆంధ్రజ్యోతి, ఫొటో జర్నలిస్టు మహబూబ్‌నగర్

యువతి అదృశ్యం

ఉప్పునుంతల, ఆగస్టు 5 : నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైంది. యువతి ఆదివారం రాత్రి ఇంట్లో నిద్రించింది. సోమవారం తెల్లవారు జామున లేచి చూసేసరికి తల్లిదండ్రులకు కన్పించలేదు. ఆచూకీ కోసం వెతికినా జాడ తెలియరాక పోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఓ యువకుడిపై అనుమానం వ్యక్తం చేస్తూ యువతి తల్లి ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై లెనిన్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



ఉదయ్‌కిరణ్ (ఫైల్)

వనపర్తి క్రైమ్, ఆగస్టు 5 : వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి మండల పరిధిలోని చిమనగుంటపల్లి గ్రామానికి చెందిన ఉదయ్‌కిరణ్(35) అనే యువకుడు వనపర్తి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. సోమవారం టీచర్స్ కాలనీలోని ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. గమనించిన స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ విషయంపై పట్టణ ఎస్సై జయన్నను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



దేవరాజు (ఫైల్)

గోపాల్‌పేట, ఆగస్టు 5 : వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండల కేంద్రంలో గడ్డిమందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై హరి ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కందూరు దేవరాజు వ్యవసాయం చేస్తు వాటర్‌ప్లాంట్ పెట్టుకొని జీవిస్తున్నాడు. మండల కేంద్రం పరిధిలో ఉన్న పొలం, బోరు విషయంలో అన్న వెంకటేష్ మధ్య గొడవలు ఉన్నాయి. గతనెల 26న మధ్యాహ్నం మళ్లీ అన్నతో గొడవ జరిగింది. ఈ క్రమంలో దేవరాజు ఆవేశంతో గడ్డిమందు తాగాడు. గమనించిన కుటుంబీకులు వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మహబూబ్‌నగర్‌కు తరలించారు. తొమ్మిది రోజులుగా చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడి భార్య కందూరు లక్ష్మి ఫిర్యాదు మేరకు వెంకటేష్, గోవిందు, గోపికృష్ణ, మహేశ్వరిలపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

- పెంట్లవెల్లి కస్తూర్బా పాఠశాల ఘటనపై మంత్రి జూపల్లి సీరియస్

కొల్లాపూర్/పెంట్లవెల్లి, ఆగస్టు 5 : పెంట్లవెల్లి కస్తూర్బా పాఠశాలలో విద్యార్థుల భోజనం పట్ల నిర్లక్ష్యం వహించిన ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకుం టామని భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే స హించేది లేదని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. సోమవారం పట్టణం లోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో నియోజకవర్గ కస్తూర్బా పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులనుద్దేశించి మంత్రి జూపల్లి మాట్లాడా రు. విద్యార్థులకు పురుగుల బియ్యం, కుళ్లిన కూరగాయలు సరఫరా చేసిన వా రిపై చర్యలు తీసుకోవాలని విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించారు. అదేవిధంగా కొల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కస్తూర్బా పా ఠశాలల విద్యార్థుల ను జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ పరామర్శించారు. విద్యార్థులకు మెరుగైన వైద్య చికిత్సలందించాలని వైద్యులను సూచించా రు. పెంట్లవెల్లి కస్తూర్బా పాఠశాలలో విద్యార్థుల పట్ల అజాగ్రత్తగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీఈవో గోవిందరాజు లు, డీఎంహెచ్‌వో రాజ్యలక్ష్మి, ఆర్డీవో నాగరాజు, కొల్లాపూర్ మునిసిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్య, ఎంఈవో చంద్రుడు పాల్గొన్నారు.



కొల్లాపూర్‌లో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి జూపల్లి



పెంట్లవెల్లి కస్తూర్బాగాంధీ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్, చిత్రంలో డీఈవో గోవిందరాజులు

కలెక్టర్ సీరియస్

పెంట్లవెల్లి కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు పురుగుల అన్నం, కుళ్లిన కూరగాయలు పెడుతుండడంతోనే విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారని సోమవారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో పురుగుల అన్నం, కుళ్లిన కూరగాయలు కథనం పేరుతో వార్త ప్రచురితం కావడంతో జిల్లా అధికారులు స్పందించారు. సోమవారం పెంట్లవెల్లి మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్ బదావత్ సంతోష్ పాఠశాలలో విద్యార్థుల కోసం ప్రస్తుతం వాడుతున్న బియ్యాన్ని కూరగాయలను మార్చాలని వెంటనే కొత్తవి ఏర్పాటు చేయాలని అదేవిధంగా కస్తూర్బాలో పని చేస్తున్న వంట సిబ్బందిని కూడా మార్చాలని అధికారులను ఆదేశించారు. వంట గదిని పరిశీలించి వంట గదిలో ఉన్న అపరిశుభ్రతపై సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరందేలా ఆర్‌వో ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఘటనకు బాధ్యులైన సిబ్బంది, ప్రత్యేక అధికారులపై చర్యలు చేపట్టాలని కలెక్టర్ డీఈవోను ఆదేశించారు.

మరో 11 మందికి అస్వస్థత

పెంట్లవెల్లి, ఆగస్టు 5: పెంట్లవెల్లి కస్తూర్బా పాఠశాలలో ఆహారం వికటించిన 25 మంది దాకా అస్వస్థతకు గురైన సంఘటనలో విద్యార్థినుల సంఖ్య పెరుగుతోంది. సోమవారం మధ్యాహ్నం కలెక్టర్ బదావత్ సంతోష్ వచ్చి భోజనం చేసి వెళ్లిన తరువాత రాత్రికి మళ్లీ తొమ్మిది మంది విద్యార్థినులు, ఇద్దరు ఉపాధ్యాయులు అస్వస్థతకు గురయ్యారు. కడుపు నొప్పి, వాంతులకు గురి కావడంతో వీరిని వెంటనే కొల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్య బృందం పాఠశాలలోనే ఉండి విద్యార్థినులను పర్యవేక్షిస్తున్నారు.

సీతాఫల్ టెండర్ వాయిదా

- ఒక్కో మండలానికి ఓ టెండర్ వేయాలని కాంట్రాక్టర్ల డిమాండ్
- డివిజన్ వారిగా టెండర్ వేస్తే రింగ్ అవుతున్నారని ఆగ్రహం
- చేసేది లేక టెండర్లు నిర్వహించని అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



అటవీశాఖ కార్యాలయం వద్ద గుంపులుగా టెండర్‌దారులు

మహబూబ్‌నగర్, ఆగస్టు 5: సీతాఫల్ టెండర్‌కు అధిక సంఖ్యలో కాంట్రాక్టర్లు తరలివచ్చారు. వందల్లో రావడంతో సీతాఫల్ సేకరణకు ఉన్న డిమాండ్ ఏంటో అర్థమవుతోంది. ఇన్నాళ్లు కొందరు కాంట్రాక్టర్లు మాత్రమే రింగ్ అయి నామమాత్రపు ధరకు టెండర్ దక్కించుకుని తరువాత సబ్‌లీజ్‌కు ఇచ్చి సొమ్ముచేసుకునేవాళ్లు. ఇదేవిషయమై సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో సీతాఫల్ టెండ 'రింగ్' శీర్షికన ప్రచురితమైన కథనంతో అధిక సంఖ్యలో కాంట్రాక్టర్లు అటవీ శాఖ కార్యాలయానికి చేరుకున్నారు. జిల్లామొత్తంగా రెండు మహబూబ్‌నగర్, మహ్మదాబాద్ డివిజన్‌ల పేరిట రెండు టెండర్లు మాత్రమే వేయడం సరికాదని, మండలాల వారిగా టెండర్లు నిర్వహించాలని డిమాండ్ చేసినట్లు సమాచారం. డివిజన్‌ల వారిగా టెండర్‌లు వేయడం వల్ల సిండికేట్‌గా మారి తమ మండలాల్లో వాళ్లు వచ్చి పెత్తనం చేస్తున్నారని, అలా కుదరదని పట్టుబట్టారు. మండలాల వారిగా వేస్తే ఎవరి మండలాలకు సంబంధించిన వాళ్లు వారి మండలాల్లో టెండర్లు వేసి సీతాఫల్ సేకరణ చేసుకుంటారని స్పష్టం చేశారు. అప్పటివరకు టెండర్లు నిర్వహించవద్దని, తాము పాల్గొనబోమని స్పష్టం చేశారు. దీంతో అధికారులు చేసేది లేక ప్రస్తుతానికి సోమవారం నిర్వహించాల్సిన టెండర్ల నిర్వహణను వాయిదా వేశారు. ఎలా టెండర్లు నిర్వహించాలని చర్చించిన తరువాత మళ్లీ తేదీ ప్రకటించే అవకాశం ఉంది.

'సర్వేచేసి హద్దులు నిర్ణయించాలి'

గద్వాల, ఆగస్టు 5 : జోగుళాంబ గద్వాల జిల్లా, గద్వాల మండల పరిధిలోని జమ్మిచేడు శివారులోని తమ భూమిని సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని పట్టాదారులు భాస్కర్, ఎల్లప్ప, శ్రీనివాస్ గౌడ్, మహేష్ గౌడ్ డిమాండ్ చేశారు. 'ఆర్అండ్‌బీ రోడ్లకు పట్టా పాసుపుస్తకాలు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి వారు స్పందించారు. అందులో పేర్కొన్నట్లుగా తమకు చెందిన సర్వే నెంబర్ 341లోని భూమిలో బీటీ రోడ్డు లేదని స్పష్టం చేశారు. తహసీల్దార్ పూర్తిగా నిర్ధారించిన తర్వాతే తమకు పట్టా చేశారని వారు తెలిపారు. దళితులమైన తమను కొందరు భయపెట్టి, భూమిని సర్వే చేయించకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. సర్వే చేస్తే ఎవరి భూమి ఎక్కడ ఉందో నిర్ధారణ అవుతుందని తెలిపారు. ఈ మేరకు వారు ఇన్‌చార్జి తహసీల్దార్ కర్ణాకర్‌ను సోమవారం కలిసి సమస్యను వివరించారు.

చివరి ఆయకట్టుకు సాగునీరు అందిస్తాం

- మంత్రి జూపల్లి కృష్ణారావు



కాలువను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

పాన్‌గల్, ఆగస్టు 5 : తెలంగాణ రాష్ట్రంలోని కెఎల్ఐ, బీమా కాలువల ద్వారా చివరి ఆయకట్టు వరకు రైతులకు సాగునీరు అందిస్తామని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం సాయంత్రం వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం కదిరేపాడు, శాఖాపూర్, మాధవరావుపల్లి, రాయిపల్లి గ్రామాల్లో బీమా, కేఎల్ఐ కాల్వలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంటలకు సరిపడా చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామని తెలిపారు. అదేవిధంగా మండల కేంద్రంలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి, నీరు పోశారు. బాలుర ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న ప్రహరీ నిర్మాణానికి తన నిధుల నుంచి రూ.25 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో ఉమాదేవి, ఎంపీడీవో గోవిందరావు, బీమా, కేఎల్ఐ అధికారులు, మాజీ ఎంపీపీ వెంకటేష్‌నాయుడు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రవికుమార్, సింగిల్ విండో మాజీ ఉపాధ్యక్షుడు ముంతా భాస్కర్ యాదవ్, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కృష్ణానదిలో వరద జలాలకు పూజలు

కొల్లాపూర్: ఏరులై పారుతూ నిండుకుండలా జల కళ సంతరించుకున్న కృష్ణానది వరద జలాలకు మంత్రి జూపల్లి కృష్ణారావు ఘనంగా స్వాగతం పలికారు. సోమవారం మండల పరిధిలోని సోమశిల గ్రామంలో లలితాంబిక సోమేశ్వరాలయాన్ని సందర్శించిన రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఆలయ అర్చకులు, ఎండోమెంట్ అధికారులు, ఆలయ చైర్మన్ పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం సోమశిల ఘాట్‌ల వద్ద వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య కృష్ణానది వరద జలాలకు మంత్రి జూపల్లి, కలెక్టర్ బదావత్ సంతోష్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించి వరద జలాలకు హారతితో స్వాగతం పలికారు. సోమశిల గ్రామంలో పర్యాటక అభివృద్ధికి ఉన్న అవకాశాలు, చేపట్టాల్సిన పనులు, అంచనాలు, ప్రణాళికల రూపకల్పనలపై టూరిజం శాఖ అధికారులతో చర్చించారు. అనంతరం మంత్రి జూపల్లి విలేకర్లతో మాట్లాడుతూ కృష్ణా, గోదావరి పరివాహక ప్రాంతాలను టూరిజం హబ్‌లుగా తీర్చిదిద్దుతామని ఆయన వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏకో టెంపుల్, మెడికల్ టూరిజంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. త్వరలోనే నూతన పర్యాటక విధానాన్ని తీసుకొస్తామన్నారు. ఆర్డీవో పి.నాగరాజు, పురావస్తు పర్యాటక శాఖ అధికారులు, కొల్లాపూర్ మునిసిపల్ కౌన్సిలర్లు, సింగిల్ విండో డైరెక్టర్లు, మండల మాజీ ప్రజాప్రతినిధులు, సోమశిల గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేస్తున్న దమ్మున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి



మాట్లాడుతున్న జిల్లెల చిన్నారెడ్డి

వనపర్తి టౌన్, ఆగస్టు 5 : ఇచ్చిన హామీలను అమలు చేస్తు పరిపాలన సాగిస్తున్న దమ్మున్న నాయకుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల రుణమాఫీ చేస్తున్నామని, ఇప్పటికే రూ.1.50 లక్షలు మాఫీ చేశామని, ఆగస్టు 15లోపు మిగిలిన రూ.50 వేలు కూడా చేస్తామన్నారు. అదేవిధంగా పేద ప్రజల కోసం కొత్త రేషన్ కార్డులు కూడా త్వరలో జారీ చేయడం జరుగుతుందని, ఆరోగ్యశ్రీ కార్డులు కూడా ఇస్తామన్నారు. నిరుద్యోగ సమస్యను అధిగమించేందుకు ఆగస్టు 15న రాష్ట్ర వ్యాప్తంగా స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేయబోతున్నామని, మొదటి విడతలోనే వనపర్తిలో కూడా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను రామానంద తీర్థ ఇనిస్టిట్యూట్ ద్వారా ప్రారంభించుకోబోతున్నామని తెలిపారు. ఐటీఐ కళాశాల పక్కనే అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్‌ను రూ.ఐదు కోట్లతో రూపాంతరం చేయబోతున్నామని అన్నారు. ఇళ్లు లేని పేద ప్రజల కోసం ఇందిరమ్మ పథకం ద్వారా నియోజకవర్గంలో 3500 ఇళ్లు మంజూరు కాబోతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. దాంతోపాటు నిరుపేదల ఆకలి తీర్చడానికి త్వరలోనే రూ.5 భోజన కేంద్రం నెలకొల్పేందుకు కలెక్టర్, మునిసిపల్ కమిషనర్‌లతో సంప్రదింపులు జరిపి ఏర్పాటుకోసం కృషి చేస్తున్నామని తెలిపారు. అనంతరం 36 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కదిరె రాములు, కోట్ల రవి, నందిమల్ల యాదయ్య, కమ్మర్‌మియా, కిరణ్‌కుమార్, ఎండీ బాబా, గంజాయి రమేష్, దివాకర్, రాగివేణు, రోహిత్, చెన్నరాములు, కోళ్ల వెంకటేష్, చీర్ల జనార్దన్, నారాయణ, పరశురాం, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, బాలరాజు, పాండురావు, గడ్డం వినోద్, ఆవుల చంద్రశేఖర్, ఆసీఫ్, రవి, చరణ్, కుమార్ తదితరులున్నారు.

మిన్నంటిన రోదనలు

- నాసిక్‌లో రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకుల దుర్మరణం
- మరో ముగ్గురికి గాయాలు

దామరగిద్ద, ఆగస్టు 5 : పిల్లలను తల్లిదండ్రులతోనే వదిలి పొట్టకూటి కోసం మహారాష్ట్రలోని నాసిక్‌కు వలస వెళ్లిన ఆరుగురు యువకుల్లో ముగ్గురు యువకులు రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే ఆదివారం రాత్రి మృత్యువాత పడ్డారు. మరో ముగ్గురు తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతుండటంతో నారాయణపేట జిల్లా దామరగిద్దలోని మొగల్‌మడ్క గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతి చెందిన ముగ్గురు యువకుల తల్లిదండ్రులు, భార్యపిల్లలు విషాద ఘటనను జీర్ణించుకోలేక లబోదిబోమంటున్నారు. మృతి చెందిన వారిలో పాపిరాజు (25)కు పెళ్లి కాలేదు. రెండు నెలల క్రితం పెళ్లి నిశ్చితార్థమయ్యింది. మృత్యువాత విన్న బంధు మిత్రులు, తల్లిదండ్రులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. అదే విధంగా మొగులప్ప (28)నిరుపేద కుటుంబం. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉంది. గత పదేళ్ల నుంచి నాసిక్‌లో కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తూ మూడు, ఆరు నెలలకోమారు గ్రామానికి వచ్చి తల్లిదండ్రులను, పిల్లలను చూసి వెళ్లేవాడు. మొగులప్ప మృతి చెందిన విషయం తెలియడంతో భార్యాపిల్లలు గుండెలవిసేలా రోదిస్తున్నారు. అదేవిధంగా వెంకటప్ప (35)కు ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిని తమ అత్తమ్మ దగ్గరవదిలి భార్యతో నాసిక్‌కు వెళ్లాడు. వెంకటప్పకు తండ్రి, తమ్ముడు కూడా ఉన్నారు. వీరు హైదరాబాద్‌లో బతుకు దెరువుకై వెళ్లి జీవనం కొనసాగిస్తున్నారు. మృత దేహాలకు పంచనామా నిర్వహించి నాసిక్ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి సొంత గ్రామమైన మొగలమడ్కకు తీసుకువస్తున్నారు. మంగళవారం ఉదయం వరకు మృతదేహాలు గ్రామానికి చేరుకుంటాయని గ్రామస్థులు తెలిపారు. ఈ సంఘటనలో మరో ముగ్గురు రాజు, శేఖర్, మహిపాల్ గాయపడి నాసిక్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మహిపాల్‌కు కాళ్లు, చేతులు విరగ్గా, రాజు, శేఖర్‌కు గాయాలైనట్లు గ్రామస్థులు తెలిపారు.

బైరవగుట్టపై కొత్త రాతియుగపు ఆనవాళ్లు

● పురావస్తు పరిశోధకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి



ఆనవాళ్లు పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి

భూత్పూర్, ఆగస్టు 5: మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం లోని జాతీయ రహదారికి పక్కనే ఉన్న తాటికొండ బైరవగుట్టపై కొత్త రాతి యుగపు ఆనవాళ్లను గుర్తించినట్లు పురావస్తు పరిశోధకులు, ప్లీచ్ ఇండి యా సీఈవో డాక్టర్ శివనాగిరెడ్డి చెప్పారు. భూత్పూర్‌కు చెందిన రామ లింగేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త సత్తూర్‌అశోక్‌గౌడ్ ఇచ్చిన సమాచారం మేరకు సోమవారం బైరవగుట్టపై విస్తృతంగా జరిపిన పరిశోధనలో దాదాపు పదికి పైగా కొత్త రాతియుగపు రాతిగొడ్డలి, సానపెట్టిన రాతి సానెలు ఉన్నాయని, గుట్టపై శిలాయుగపు కొండచరియ ఆవాసాలు కూడా ఉన్నాయని అన్నారు. 7 నుంచి 15 అంగుళాల పొడవైన, రెండు నుంచి నాలుగు అంగుళాల వెడల్పు, అంగుళం లోతు గాళ్లు ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయని తెలిపారు. నిర్మాణ సామగ్రి కోసం రాతిని తీసే క్రమంలో ఇవి ఉనికి కోల్పోయే ప్రమాదం ఉందని ఆయన వెల్లడించారు. క్రీ.పూ 4000 సంవత్సరాలకు చెందిన ఆదిమానవుని ఆనవాళ్లను కాపాడుకుని భావితరాలకు అందించాలని గ్రామప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బంగారు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ హామీని నెరవేర్చిన ఎమ్మెల్యే



సొంత డబ్బులతో ఆటోను కొనుగోలు చేసి అందజేస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, ఆగస్టు 5 : ఓ నిరుపేద కుటుంబానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అండగా నిలిచారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కల్వకుర్తి మండలం జిల్లెల గ్రామాన్ని ఏఐసీసీ అధినేత రాహుల్‌గాంధీ, పీసీసీ అధ్యక్షుడు, సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డిలు సందర్శించారు. జిల్లెల గ్రామానికి చెందిన తిరుపతమ్మ ఆమె కుమారుడు నితిన్‌ల కుటుంబాన్ని వారు పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామని, ఉపాధికి అవసరమైన సహాయం చేస్తామని రాహుల్‌గాంధీ ప్రకటించారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి రూ.3లక్షల 50వేల ఆటోను కొనుగోలు చేశారు. సోమవారం కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తిరుపతమ్మ కుమారుడు నితిన్‌కు ఎమ్మెల్యే ఆటోను అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, జిల్లెల మాజీ సర్పంచ్ రాములు, కాంగ్రెస్ నాయకులు కాయితీ ఆశాదీప్‌రెడ్డి, కౌన్సిలర్లు గోరటి శ్రీనివాసులు, ఎజాస్, రవీందర్, నాయకులు షానవాజ్‌ఖాన్, విజయ్‌కుమార్‌రెడ్డి, రమాకాంత్‌రెడ్డి, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టిఫిన్ చేస్తుండగా గుండెపోటుతో వ్యక్తి మృతి

బిజినేపల్లి, ఆగస్టు 5 : మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలోని టిఫిన్ సెంటర్‌లో సోమవారం ఉదయం టిఫిన్ చేస్తుండగా గుండెపోటుతో అస్వస్థకు గురై అంగోతు దాసునాయక్ (50) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని అనేకాన్‌పల్లి తండాకు చెందిన మృతుడు దాసునాయక్‌కు చెందిన వ్యవసాయ భూమి, ఇల్లు సర్వం పాలమూర్-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న వట్టెం రిజర్వాయర్‌లో మునిగిపోయింది. దీంతో లూర్దునగర్ సమీపంలో ప్రభుత్వం ఇచ్చిన పరిహారంతో ఇల్లు కట్టుకొని కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజులాగే బిజినేపల్లి మండల కేంద్రానికి వచ్చిన దాసు నాయక్ టిఫిన్ చేస్తుండగా ఛాతిలో నొప్పి వస్తుందని అస్వస్థకు గురై క్షణాల్లోనే ప్రాణాలు కోల్పోవడంతో చూపరులను కంటతడి పెట్టించింది. వెంటనే భార్య పిల్లలకు సమాచారం ఇవ్వడంతో శవాన్ని ఇంటికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

త్రుటిలో తప్పిన పెనుప్రమాదం

ఊర్కొండ, ఆగస్టు 5: త్రుటిలో పెనుప్రమాదం తప్పిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండల కేంద్రంలోని కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారిపై సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఈ సంఘటనపై బొలేరో వాహన డ్రైవర్ రామస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. కల్వకుర్తి మునిసిపాలిటీ పరిధిలోని జేపీ నగర్ నుంచి షెడ్డుకు సంబంధించిన రేకులు, పైపులు తీసుకొని తలకొండపల్లి మండలం మాదాయిపల్లి వెళుతున్న క్రమంలో మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఆవు అకస్మాత్తుగా రోడ్డుపైకి వచ్చినట్లు తెలిపారు. ఆవును తప్పించే క్రమంలో బ్రేకులు వేయడంతో బొలెరో వాహనంలో ఉన్న రేకులు, పైపులు కిందపడినట్లు తెలిపారు. ఆ సమయంలో రోడ్డుపై ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని పేర్కొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

వెల్దండ, ఆగస్టు 5: నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల పరిధిలోని జోద్యనాయక్‌తండా సమీపంలో రోడ్డు పక్కన పొదల్లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. సోమవారం ఉదయం రోడ్డు పక్కన పొదల్లో గుర్తు తెలియని వ్యక్తి చనిపోయి ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతునికి 65 ఏళ్ల ఉండవచ్చని, మృతదేహం కుళ్లిపోయి ఉందని పేర్కొన్నారు. కాగా గత 10 రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తి సమీప తండా వద్ద సంచరించినట్లు తండా వాసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన నాయకులు



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన కాంగ్రెస్ శ్రేణులు

మన్ననూర్, ఆగస్టు 5: శ్రీశైలం దైవదర్శనానికి వెళ్లి వస్తున్న క్రమంలో అమ్రాబాద్ మండలం మన్ననూరు మృగవాణి రెస్టారెంట్ వద్ద సోమవారం సాయంత్రం ఆగిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను స్థానిక కాంగ్రెస్ శ్రేణులు కలిశారు. మొదటి సారిగా మన్ననూరు వచ్చిన సందర్భంగా మంత్రికి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రికి స్థానిక సమస్యలను విన్నవించారు. మద్దిమడుగు-మాచర్లను కలుపుతూ కృష్ణానదిపై వంతెన ఏర్పాటు చేయాలని, తద్వారా నల్లమలలోని అమ్రాబాద్, పదర మండలాలు అభివృద్ధి పథంలో నడుస్తాయని, మన్ననూరులోని శ్రీశైలం, హైదరాబాద్, మద్దిమడుగు కూడలి వద్ద నిర్మించి ఉన్నటువంటి ప్రయాణ ప్రాంగణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి నల్లమల సమస్యలన్నీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళతానని, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో నల్లమల అభివృద్ధికి సహకరిస్తానని కోరారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు దాసరి శ్రీనివాసులు, మాజీ కోఆప్షన్ సభ్యుడు రహీం, కాంగ్రెస్ నాయకులు పెర్ముల వెంకటేశ్వర్లు, జాకీర్ షరీఫ్, వెంకటయ్య రవి కుమార్, దేవేందర్, వెంకటేశ్వర్లు , శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దొంగల పట్టివేత

- రిమాండ్‌కు తరలించిన పోలీసులు
- నిందితుల నుంచి పది సెల్‌ఫోన్లు రికవరీ



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ లింగయ్య

కోస్గి, ఆగస్టు 5 : మూడు రోజుల క్రితం కోస్గి బస్టాండ్‌లో బుజ్జి బాయ్ అనే మహిళ తన సెల్‌ఫోన్ దొంగిలించారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. మళ్లీ రెండు రోజుల తర్వాత మరో వ్యక్తి సెల్‌ఫోన్ దొంగిలించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ అంశాన్ని చాలెంజ్‌గా తీసుకున్న పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. కోస్గి బస్టాండ్‌లో ఇద్దరు కానిస్టేబుళ్లు మఫ్టీలో ఉండి నిన్న సాయంత్రం అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా వివిధ ప్రాంతాల్లో వారు ఫోన్ల దొంగతనాలకు పాల్పడినట్లుగా ఒప్పుకున్నారు. ఈ మేరకు కోస్గి సర్కిల్ కార్యాలయంలో డీఎస్పీ లింగయ్య సోమవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మహబూబ్‌నగర్, షాద్‌నగర్, శంషాబాద్‌లలో విలువైన ఫోన్లు దొంగిలించిట్లు పోలీసులు గుర్తించినట్లు పేర్కొన్నారు. నిందితులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లా డోన్ ప్రాంతానికి చెందిన ఎల్లప్ప, పకీరప్పగా గుర్తించారు. వారి నుంచి సుమారు రూ.2,50,000 విలువ గల పది సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దొంగలించబడిన సెల్‌ఫోన్లను బాధితులకు అందజేస్తామని డీఎస్పీ వెల్లడించారు. సెల్‌ఫోన్ దొంగలను చాకచక్యంగా పట్టుకున్న కానిస్టేబుల్ నర్సింహులు, రాఘవేందర్‌కు త్వరలోనే ఎస్పీ ఆధ్వర్యంలో రివార్డు ఇవ్వనున్నట్లు తెలిపారు. సీఐ దస్రు నాయక్, ఎస్ఐ వెంకటరమణ పాల్గొన్నారు.

పొలాలకు వెంటనే సాగునీరు అందించాలి

» మంత్రి జూపల్లి కృష్ణారావు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఆగస్టు 5 : వ్యవసాయ పంట పొలాలకు మూడు, నాలుగు రోజుల్లో కాలువల ద్వారా వెంటనే సాగునీరు అందించాలని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. సోమవారం రాత్రి మంత్రి జిల్లా కేంద్రంలోని ఐడీవోసీకి చేరుకొని అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పసుపుల నుంచి నీరు వదిలి పదిరోజులు అవుతున్నప్పటికీ పాన్‌గల్ వరకు నీరు ఎందుకు చేరుకోలేదని ఇరిగేషన్ శాఖ ఇంజనీర్లను ప్రశ్నించారు. కాలువల్లో పేరుకుపోయిన పూడికతీతకు ప్రతిపాదనలు పంపాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అద్దంకి దయాకర్, కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పంటలకు సాగునీరు అందిస్తాం

» ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి

» మండలంలో డీ-8 కాలువ పరిశీలన



డీ-8 కాల్వను పరిశీలిస్తున్న చిన్నారెడ్డి

గోపాల్‌పేట/శ్రీరంగాపురం, ఆగస్టు 5 : రైతులకు సాగునీరు అందించే బాధ్యత తమ ప్రభుత్వం తీసుకుంటుందని ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. సోమవారం గోపాల్‌పేట మండలంలోని తిరుమలపూర్, మున్ననూర్ గ్రామాల్లో ఉన్న డీ-8 కాలువను రైతులతో కలిసి పరిశీలించారు. అనంతరం సంబంధిత శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఆ తర్వాత రైతులతో మాట్లాడుతూ కాల్వలో ఉన్న పిచ్చిమొక్కలు, జమ్ము వంటి వాటిని హిటాచీ సాయంతో నేటినుంచి తొలగిస్తామని, రైతులు అధైర్యం చెందొద్దని అన్నారు. కార్యక్రమంలో ప్రవీణ్‌రెడ్డి, జయమల్లు, బోజన్న, లోకేశ్వర్‌రెడ్డి, గోవర్ధన్, శశి, వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు. అనంతరం శ్రీరంగాపురం మండల కేంద్రానికి చెందిన మహిముద్‌కు ప్రభుత్వం నుంచి మంజూరైన ఎల్‌వోసీని చిన్నారెడ్డి అందించారు.

వనపర్తి సబ్ రిజిస్ట్రార్‌గా చంద్రశేఖర్‌రెడ్డి



చంద్రశేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న దస్తావేజు లేఖర్లు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఆగస్టు 5 : వనపర్తి సబ్ రిజిస్ట్రార్‌గా చంద్రశేఖర్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జోగులాంబ గద్వాల సబ్ రిజిస్ట్రార్‌గా కొనసాగుతున్న చంద్రశేఖర్‌రెడ్డి బదిలీపై వనపర్తికి వచ్చి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వనపర్తి దస్తావేజు లేఖర్ల సంఘం ఆధ్వర్యంలో సబ్ రిజిస్ట్రార్‌ను శాలువా, పూలమాలలతో సన్మానం చేసి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు పలు సమస్యలను సబ్ రిజిస్ట్రార్ దృష్టికి తీసుకువెళ్లారు. దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జహంగీర్, నాయకులు పాల్గొన్నారు.

కేరళ వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

అమరచింత/వీపనగండ్ల, ఆగస్టు 5 : కేరళ వరద బాధితుల సహాయార్థం సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం అమరచింతలో విరాళాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా అమరచింతలోని బస్టాండ్ సెంటర్‌తో పాటు, వ్యాపార సంస్థల వద్ద విరాళాలను సేకరించారు. వచ్చిన రూ.9542 నగదును కేరళ వరద బాధితుల సహాయనిధికి పంపించనున్నట్లు సీపీఎం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జీఎస్.గోపి, నాయకులు ఆర్ఎన్.రమేష్, బి.వెంకటేష్, ఎస్.అజయ్, బుచ్చన్న, శ్రీను, జహంగీర్ తదితరులున్నారు. వీపనగండ్లలో సీపీఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మొదటిరోజు రూ.3600 విరాళం ద్వారా సేకరించినట్లు పార్టీ మండల కార్యదర్శి బాల్‌రెడ్డి తెలిపారు. సీపీఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు మురళి, ఆశన్న, ఈశ్వర్, వెంకటేశ్వర్లుగౌడ్, భక్తుల రాముడు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు వేయాలని కలెక్టరేట్‌కు పాదయాత్ర

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఆగస్టు 5 : మండల పరిధిలోని ఏదుట్ల, రేమద్దుల, సింగాయిపల్లి మీదుగా బీటీ రోడ్డును అభివృద్ధి చేయాలని రేమద్దుల గ్రామ బీజేపీ నాయకులు వనపర్తి కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేశారు. ఈ మేరకు వారు 22 కిలోమీటర్లు నడిచి సోమవారం కలెక్టర్ ఆదర్శ్ సురభికి ఆయన ఛాంబర్‌లో వినతిపత్రం అందించారు. పదివేల జనాభా ఉన్న రేమద్దుల గ్రామానికి బీటీ రోడ్డు సరిగ్గా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్య, వైద్యం, వ్యాపార నిమిత్తం వనపర్తి పట్టణానికి రావాలంటే గుంతలమయమైన రోడ్లపై బస్సులు తిరగట్లేదని వాపోయారు. పాదయాత్రకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ సంఘీభావం తెలిపి వారితో పాటు, కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డుకు ఎంపికైన కార్మికులు

అమరచింత, ఆగస్టు 5 : రాష్ట్ర స్థాయిలో అమరచింత చేనేత కార్మికులు తమ సత్తాను చాటారు. ప్రభుత్వం ప్రతీ ఏడాది ఇచ్చే కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డుకు అమరచింత గ్రామానికి చెందిన ముగ్గురు నేత కార్మికులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి అవార్డుకు ఎంపికయ్యారు. ఈనెల 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం చేనేత కార్మికులకు ఇచ్చే కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డుకు అమరచింతకు చెందిన చేనేత కార్మికులు గాజుల వెంకటేష్, చిన్ని సీతారాములు, తిప్పడంపల్లి గ్రామానికి చెందిన పెరమల సత్యన్నలు ఎంపికయ్యారు. ఈ మేరకు వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల చేనేత సహాయ సంచాలకులు గోవిందయ్య ఎంపికైన కార్మికులకు సమాచారం ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈనెల 7న హైదరాబాద్‌లోని పీపుల్ ప్లాజాలో జరిగే రాష్ట్ర స్థాయి సదస్సులో నేత కార్మికులు అవార్డుతో పాటు, ఒక్కొక్కరు 25వేల నగదు అందుకోనున్నారు. వీరి ఎంపికపై పట్టణంలోని చేనేత కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.

పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటిన విద్యార్థులు

పెబ్బేరురూరల్, ఆగస్టు 5 : మండల పరిధిలోని యాపర్ల ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన లతీఫ్, పవన్, విజయ్ అనే విద్యార్థులు వారివారి పుట్టినరోజు సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. హెచ్ఎం శంకర్‌గౌడ్ విద్యార్థులను అభినందించారు. ప్రతీ విద్యార్థి పుట్టినరోజు సందర్భంగా పాఠశాలలో గాని, వారి ఇంటి ఆవరణలో గాని, పొలాల వద్ద గాని మొక్కలు నాటాలని కోరారు. అదేవిధంగా, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఉపాధ్యాయులు ఖాజామైనొద్దీన్, వెంకటేష్, ఈశ్వర్‌రెడ్డి, బాలమ్మ, కవిత పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

కొత్తకోట, ఆగస్టు 5 : మండలంలో శ్రావణమాసం ప్రారంభం సందర్భంగా తొలి సోమవారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని భవానీశంకర, పాత శివాలయం, భక్త మార్కండేయస్వామి ఆలయాలతో పాటు, కానాయపల్లి, పామాపురం గ్రామ శివారులోని కోటిలింగేశ్వరస్వామి, రామేశ్వరస్వామి దేవాలయాల్లో భక్తులు శివలింగాలకు ఏకాదశ రుద్రాభిషేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయాల నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

కోటిలింగాల ప్రతిష్ఠకు విరాళం

మండలంలోని కానాయపల్లి గ్రామ బస్టాండ్ సమీపంలో శైవక్షేత్రం కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో కోటిలింగాల ప్రతిష్ఠాపనకు వనపర్తి మండలం పెద్దగూడెం గ్రామానికి చెందిన మనోజ్‌కుమార్‌రెడ్డి, అదితి దంపతులు రూ.27 వేల విరాళాన్ని ఆలయ ప్రధాన కార్యదర్శి శేఖరయ్యకు అందజేశారు.

హాస్టళ్లలో వసతుల కల్పనలో ప్రభుత్వం విఫలం

ఆత్మకూరు, ఆగస్టు 5 : సంక్షేమ వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలమైందని ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రవి, యూసుఫ్‌లు అన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడిచినా పట్టణంలోని ఎస్సీ, బీసీ వసతిగృహాల విద్యార్థులకు దుస్తులు, దుప్పట్లు నోటుబుక్కులు అరకొరగా మాత్రమే ఇచ్చారని తెలిపారు. అలాగే ఎస్సీ వసతిగృహంలో నోట్ పుస్తకాలను ఇప్పటివరకు పంపిణీ చేయలేదని వాపోయారు. సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులకు వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం చేస్తే జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలకు పూనుకుంటామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు సమీర్, జిలాని, చరణ్, పాషా, వసీం తదితరులున్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు ఉద్యాన కళాశాల విద్యార్థులు

పెద్దమందడి, ఆగస్టు 5 : జిల్లా స్థాయిలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీలో మోజర్ల ఉద్యాన కళాశాల విద్యార్థులు వివిధ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలను సాధించారని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పిడిగం సైదయ్య తెలిపారు. అండర్-20 బాలుర విభాగంలో 400 మీటరు పరుగు పందెం పోటీలో ఏ.ధన్‌రాజ్ ప్రథమ స్థానం, బాలికల విభాగంలో 400 మీటరు పరుగు పందెంలో వి.భారతి ప్రథమ స్థానం, పురుషుల విభాగంలో 100 మీటరు పరుగు పందెంలో ఎంఏ పర్వేజ్, 100, 400 మీటర్ల పరుగులో ప్రథమ స్థానంలో ఎస్.సంతోష్ విజయం సాధించారని తెలిపారు. విజేతలు జావలిన్‌డే పురస్కరించుకొని ఈనెల 7వ తేదీన హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో జరగబోయే తెలంగాణ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన వివరించారు. కార్యక్రమంలో ఓఎస్‌ఏ డాక్టర్ రాజశేఖర్, ఓఏం డాక్టర్ షహనాజ్, ఫిజికల్ డైరెక్టర్ మహేష్ పాల్గొన్నారు.



ఖిల్లాఘణపురం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్క నాటిన అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్



శ్రీరంగాపురంలోని జడ్పీహెచ్ఎస్ ఆవరణలో మొక్క నాటుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు



వీపనగండ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు

శానిటేషన్‌పై శ్రద్ధ చూపాలి

» పాఠశాల, ఆసుపత్రి ఆవరణలను పరిశుభ్రంగా ఉంచాలి

» ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి

» అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్



అమరచింతలో బోనాలతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధికారులు, ప్రజాప్రతినిధులు



పాన్‌గల్‌లో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న డీఆర్‌డీవో ఉమాదేవి

ఖిల్లాఘణపురం, ఆగస్టు 5 : గ్రామాల్లో శానిటేషన్‌పై శ్రద్ధ చూపాలని జిల్లా లోకల్‌బాడీ అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అధికారులకు సూచించారు. మండల కేంద్రంతో పాటు, కమలొద్దీన్‌పూర్ గ్రామంలో సోమవారం స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో, ఆసుపత్రిలో చేపడుతున్న పనులను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కను నాటారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలలో చేపట్టిన మరమ్మతు పనులను పరిశీలించి, వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థులకు అందించే అన్నం, కూరలను పరిశీలించారు. కమలొద్దిన్‌పూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకుని, ఆసుపత్రి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సంచిత్ గంగ్వార్ మాట్లాడుతూ గ్రామాల్లో విస్తృతంగా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఈఈ మల్లయ్య, తహసీల్దార్ పాండు, ఎంపీడీవో వెంకటాచారి, ఎంఈవో ఉషారాణి, మాజీ జడ్పీటీసీ సభ్యులు విజయ్‌కుమార్, సామ్యానాయక్, మాజీ సర్పంచ్ క్యామ వెంకటరమణ, సింగిల్ విండో వైస్ చైర్మన్ క్యామ రాజు, పంచాయతీ కార్యదర్శులు రవితేజరెడ్డి, సంధ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. అదేవిదంగా, బస్టాండ్ ఆవరణలో మండల ప్రత్యేక అధికారి, పంచాయతీరాజ్ ఈఈ మల్లయ్య ఆధ్వర్యంలో విద్యార్థులు మానవహారం చేపట్టారు. ఎంపీడీవో వెంకటాచారి, ఎంఈవో ఉషారాణి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

● అమరచింత : పట్టణంలో సోమవారం బీఎల్వోలు, అంగన్‌వాడీ, ఆశ, ఉపాధ్యాయులు, విద్యార్థులు స్వచ్ఛదనం ప్లకార్డులు ప్రదర్శిస్తూ బోనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి డీపీవో రమణమూర్తి, మత్స్యశాఖ ఏడీ లక్ష్మప్పలు హాజరై, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల ఆవరణను శుభ్రం చేసి, ఇంటింటికి వివిధ రకాల పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, వైస్ చైర్మన్ జీఎస్.గోపి, తహసీల్దార్ రమేష్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసులు, మునిసిపల్ కమిషనర్ నూరుల్‌మజీబ్, ఎంపీవో నరసింహయ్య, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మునిసిపల్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

● పాన్‌గల్ : మండల కేంద్రంలో ఉన్నత పాఠశాల హెచ్ఎం నరేందర్ ఆధ్వర్యంలో విద్యార్థులు నిర్వహించిన స్వచ్ఛదనం, పచ్చదనం ర్యాలీకి మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీవో ఉమాదేవి హాజరయ్యారు. ర్యాలీ అనంతరం గాంధీ చౌరస్తాలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎంపీడీవో గోవిందరావు, పీహెచ్‌సీ వైద్యాధికారి చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

● కొత్తకోట : మండలంలో స్వచ్ఛదనం, పచ్చదనంపై విద్యార్థులు ప్లకార్డులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కొత్తకోటలో విద్యార్థులతో పాటు, మునిసిపల్ అధికారులు, నాయకులు ర్యాలీలో పాల్గొన్నారు. బాలికల ఉన్నత పాఠశాల మైదానంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. మునిసిపల్ చైర్‌పర్సన్ సుకేశిని, కమిషనర్ సూర్యనారాయణ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు విశ్వేశ్వర్, కౌన్సిలర్లు రాములుయాదవ్, నాగన్నసాగర్, నారాయణమ్మ, రాంమోహన్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

● శ్రీరంగాపురం : మండల కేంద్రంలో జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు పాఠశాల నుంచి ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించి, శ్రమదానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎం.రాజేంద్రప్రసాద్‌యాదవ్, ఎంపీడీవో రవీందర్, తహసీల్దార్ మురళి, ఎంపీవో రాజు, గ్రామ కార్యదర్శి నందకిశోర్, ప్రభుత్వ బాలుర, బాలికల హెచ్ఎంలు రాజవర్ధన్‌రెడ్డి, లెక్చరర్లు, అంగన్‌వాడీ టీచర్లు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. శాఖాపురం, తోమాలపల్లి గ్రామాల్లో కూడా స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు.

● రేవల్లి : మండల కేంద్రంలో జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు పాఠశాల నుంచి గాంధీచౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి సురేందర్‌రెడ్డి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. తలుపునూరు గ్రామంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీదేవి, ఎంపీడీవో నరసింహారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు హరీష్, పరుశురాం, ఏపీవో నరసింహ, ఏఎన్ఎం, అంగన్‌వాడీలు, ఆశలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● ఆత్మకూరు : పట్టణంలో మునిసిపల్ కార్యాలయం నుంచి గాంధీచౌరస్తా వరకు ఆయా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో కలిసి అధికారులు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రత్యేక అధికారి సుబ్బారెడ్డి, మునిసిపల్ చైర్‌పర్సన్ గాయత్రి మాట్లాడారు. మునిసిపల్ కమిషనర్ నాగరాజు, ఎంపీడీవో సుజాత, ఏపీఎం వెంకటేశ్వర్లు, ఏపీవో విజయభాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్ రామకృష్ణతో పాటు, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఆర్పీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

● వీపనగండ్ల : మండల కేంద్రంలోని రైతువేదిక నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, అధికారులు ర్యాలీ నిర్వహించారు. శ్రమదానం నిర్వహించి, మొక్కలు నాటారు. తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీవో శ్రీనివాసరావు, మండల ప్రత్యేకాధికారి చంద్రశేఖర్, ఏవో డాకేశ్వర్‌గౌడ్, డాక్టర్లు ప్రియాంక, రాజశేఖర్, కళాశాల అధ్యాపకులు, అంగన్‌వాడీ, పారిశుధ్య కార్మికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● పెద్దమందడి : మండల కేంద్రంలో స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా శుభ్రత, పరిశుభ్రతపై గురించి ఎంపీడీవో సద్గుణ గ్రామస్థులకు అవగాహన కల్పించారు. మండల స్పెషల్ ఆఫీసర్ వేణుగోపాల్, తహసీల్దార్ చక్రపాణి, ఎంపీవో పుష్ప, ఆర్ఐ తిరుపతయ్య, ఏపీఎం నాగమణి, సింగిల్ విండో అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, పోలీసు అధికారులు, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టువీడని పోరాట వీరులే మాదిగలు

» ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



ఎమ్మార్పీఎస్ ఉద్యమకారుల సన్మాన సభలో మాట్లాడుతున్న మంత్రి

వనపర్తి టౌన్, ఆగస్టు 5 : పట్టు వీడని పోరాటం సాగించి హక్కులు సాధించుకున్న పోరాట వీరులే మాదిగ సోదరులని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ ఉద్యమకారులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ పట్టు వీడని విక్రమార్కుల వలే పట్టుబట్టి ఏబీసీడీ వర్గీకరణ సాధించుకున్నారని, ఎమ్మార్పీఎస్ ఉద్యమకారులను సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. సుదీర్ఘంగా సాగిన ఎమ్మార్పీఎస్ వర్గీకరణ ఉద్యమంలో ఎంతోమంది అమరులైయ్యారని, వారందరికీ జోహార్లు అర్పిస్తున్నానని తెలిపారు. మందకృష్ణ మాదిగ వర్గీకరణ కోసం చేసిన పోరాటం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ హక్కుల సాధన కోసం చేసిన మాదిగలు 30 ఏళ్లుగా శాంతియుతంగా పోరాటం చేసి చరిత్రలో నిలిచిపోయే విధంగా విజయం సాధించారని కొనియాడారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ బండారు శ్రీనివాస్‌గౌడ్, మునిసిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, శంకర్‌ప్రసాద్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎమ్మార్పీఎస్ ఉద్యమకారులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులు పెండింగ్‌లో ఉండొద్దు

» కలెక్టర్ ఆదర్శ్ సురభి



ప్రజలతో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఆగస్టు 5 : ప్రజావాణి ఫిర్యాదులు పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి హాల్లో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎం.నగేష్‌తో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలు పరిష్కారం అవుతాయనే నమ్మకంతో ప్రజావాణికి ఫిర్యాదులు తీసుకువస్తారని తెలిపారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఫిర్యాదులను క్షుణ్ణంగా అధ్యయనం చేసి పరిష్కరించాలన్నారు. ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టొద్దని, పరిష్కరించలేనివి ఉంటే అట్టి విషయాన్ని సదరు ఫిర్యాదుదారుకు లేఖ ద్వారా తెలియజేయాలని సూచించారు. ప్రజావాణిలో మొత్తం 78 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో యాదయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమానికి దరఖాస్తు చేసుకోవాలి

ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమానికి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి జిల్లా ప్రజలకు సూచించారు. గ్రామ, మండల స్థాయిలో నూతన ఆవిష్కరణలను వాట్సాప్ ద్వారా అందజేయాలని కోరారు. ఎంపికైన ఆవిష్కరణను ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం రోజున పరేడ్ గ్రౌండ్‌లో ఒక ప్రత్యేక స్టాల్ కేటాయించి అందులో ప్రదర్శించడం జరుగుతుందని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంపై అధికారులతో చర్చించారు. వ్యవసాయ రంగంలో మాత్రమే కాకుండా ఇతర రంగాల్లోను సమస్యను సులువుగా పరిష్కరించేందుకు విద్యార్థులు, యువకులు కొత్త విధానాలను అవలంభిస్తుంటారని, అలాంటి వారిని గుర్తించి ఇంటింటా ఇన్నోవేటర్ వాట్సాప్ ద్వారా నమోదు చేయించాలని అధికారులకు సూచించారు. వాట్సాప్ నెంబర్ 9100678543లో ఆవిష్కర్త పేరు, చిరునామా, ఫోన్ నంబర్, ఆవిష్కరించిన అంశం క్లుప్తంగా రాసి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి ఆగస్టు 10 చివరి తేదీగా పేర్కొన్నారు.

థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసులను డిస్మిస్ చేయాలి

» కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ



అంబేడ్కర్ విగ్రహం ముందు నిరసన తెలుపుతున్న కేవీపీఎస్, ఐద్వా నాయకులు

వనపర్తి టౌన్, ఆగస్టు 5 : దళిత మహిళపై దొంగతనం నెపంతో థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసులను తక్షణమే డిస్మిస్ చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి దయ్యపు రాధాకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కేవీపీఎస్, ఐద్వా ఆధ్వర్యంలో నిరసన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారం దొంగతనం నెపంతో దళిత మహిళ సునితను, 14 ఏళ్ల ఆమె కుమారుడిని చిత్రహింసలు పెట్టిన థర్డ్ డిగ్రీ ప్రయోగించిన షాద్‌నగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డితో పాటు, నలుగురు పోలీసులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒక మహిళ అని చూడకుండా, మైనర్ బాలుడని చూడకుండా పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించడం, చెప్పుకోలేని ప్రైవేట్ పార్ట్‌లో కర్రలతో కొట్టడం సభ్య సమాజానికే తలవంపులన్నారు. రాత్రి సమయంలో పోలీస్‌స్టేషన్‌లో కన్నకొడుకు ముందే దళిత మహిళను వివస్త్రను చేసి చిత్రహింసలు పెట్టడం, నేరం ఒప్పుకోమని విచక్షణారహితంగా కొట్టడం పోలీస్ వ్యవస్థకే మాయని మచ్చ అని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణ చేసి పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దళిత మహిళకు, ఆమె 14 ఏళ్ల కుమారుడికి రక్షణ కల్పించాలని, థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి లక్ష్మి, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు గంధం భగత్, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సాయిలీల, వెంకట్‌రాములు, రాజేష్, శరత్, బీసన్న, బాల్‌రెడ్డి, కృష్ణ, కవిత, రేణు, ఉమ తదితరులున్నారు.

రేపు జాతీయ చేనేత దినోత్సవం

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఆగస్టు 5 : ఆగస్టు 7వ తేదీ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐడీవోసీలో వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారిని ఉమాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదర్శ్ సురభితో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని అన్నారు. చేనేత వస్త్రాల వాడుక, చేనేత కళని ప్రోత్సహించుట, వారసత్వ సంపదను కాపాడుకోవడం గురించి వారు వివరిస్తారని పేర్కొన్నారు. జిల్లాలోని చేనేత, సిల్క్, ఉన్ని, సహకార సంఘాల అధ్యక్షులు, మాస్టర్ వీవర్లు, చేనేత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

పోలీస్ ప్రజావాణికి తొమ్మిది ఫిర్యాదులు

వనపర్తి క్రైమ్, ఆగస్టు 5 : పోలీస్ ప్రజావాణికి వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అడిషనల్ ఎస్పీ రామదాసు తేజావత్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజావాణికి తొమ్మిది ఫిర్యాదులు వచ్చాయని ఆయన తెలిపారు.

రైతు బీమా దరఖాస్తులు 648

ఆత్మకూరు, ఆగస్టు 5 : రైతు బీమా కోసం మండలంలో 648 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నట్లు ఏవో వినయ్ కుమార్ తెలిపారు. నూతనంగా భూమి హక్కు పొందిన రైతులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు బీమా పొందేందుకు మరో అవకాశం కల్పించడంతో రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. సోమవారం నాటికి నూతన దరఖాస్తులకు గడువు ముగిసిందని ఆయన తెలిపారు.

పీహెచ్‌సీలో రక్త నమూనాల సేకరణ

శ్రీరంగాపురం, ఆగస్టు 5 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కలెక్టర్ ఆదేశంతో 52 మంది నుంచి రక్త నమూనాలు సేకరించినట్లు జిల్లా వైద్యాధికారి జయచంద్రమోహన్ తెలిపారు. సేకరించిన నమూనాలను వనపర్తిలోని తెలంగాణ డయాగ్నస్టిక్ కేంద్రంలో పరీక్షలు నిర్వహిస్తామని ఆయన చెప్పారు. ఇక నుంచి స్థానిక పీహెచ్‌సీలో ప్రతీరోజు రక్త నమూనాలు సేకరిస్తామని డాక్టర్ రాముడు తెలిపారు.

విద్యార్థులకు షూస్ పంపిణీ

అమరచింత, ఆగస్టు 5 : పట్టణంలోని దేశాయి మురళీధర్‌రెడ్డి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం దేశాయి మురళీధర్‌రెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో బూట్లు(షూస్) పంపిణీ చేశారు. పాఠశాలలోని ఒకటి నుంచి ఏడో తరగతి చదువుతున్న 350 మంది విద్యార్థులకు తెలుపు, నలుపు బూట్లను ఒక్కొక్కరికి రెండు జతలు అందించినట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో డీఎంఆర్ ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం కళావతమ్మ, దేశాయి ప్రకాష్‌రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు సయ్యద్ కలాంపాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామ సమస్యలు పరిష్కరించాలని వినతి

వీపనగండ్ల, ఆగస్టు 5 : మండల కేంద్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం పంచాయతీ కార్యదర్శికి ప్రజా సంఘాల నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ మండల కార్యదర్శి మురళి మాట్లాడుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రెండురోజుల పాటు నిర్వహించిన సర్వేలో అనేక సమస్యలు తమ దృష్టికి వచ్చాయని తెలిపారు. వీధులన్నీ అధ్వానంగా ఉన్నాయని, వీధిలైట్లు లేక గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు చరణ్, రైతు సంఘం నాయకులు రామకృష్ణ, భక్తుల రాముడు, వెంకన్నగౌడ్ తదితరులున్నారు.